*మానుడి జల్మ మిందనే రోతబుట్టిపోతుండాదామెకి.
యెల్లాలకల పొనుకోని మొకాన ఎంగిలి పడేటట్టుగా
వూంచుకుందామనిపిస్తా వుండాది. ఒకపక్క ఓ అని కుశాల,
యింగొకపక్క ఎక్కళ్లేని దుఃక్కం ఆమెని వూపిరాడనీకుండా చేస్తుండాయి.*

నామిని

# 8

# రాతి మిద్దాయన చిన్న కుమార్తె





ఎడమ కన్ను దేనికో అదేపనిగా అదర్తా వుండాది నాగేస్పరికి. ఏం చెడ్డ జరగబోతాదో తెలస్తానే వుండాది. జరగబొయ్యే చెడ్డ గురిచ్చి యోచన జెయ్యాలంటేనే తల పట్టగట్టి పోతుండాది. తెల్లారనంగా రొండు దోశిలు బోసుకొని, మిక్సీలో అంత టమేటా కారం చేసుకోని తినేసింది. దానికనేనేమో కడుపులో దగగా వుంటే స్టీలుగ్లాసులో కాసింత పెరుగేస్కోని, మజ్జిగ జేస్కోని తాగినా కడుపులో నిమ్మళంగా లేదు. గిన్నిడుతో గిన్నిడు ఉప్పుడు బియ్యం చద్దికూడు తాగి అంత మారేడుగొమ్మను దవడన బెట్టుకోని నంజుకోని తింటే కడుపులో ఎంత శాంబరంగా వుంటాది! ఈ యింట్లో యెదవలు చద్దికూడు తాగరే. వూరి మొత్తం టిపన్లకు మరిగినట్టు వీళ్లూ మరిగినారే. అయినా యీ దగ దోశిలు తిన్నందువల్లా వొచ్చిందా, యాడలేని మనేద వల్లా వచ్చిందా! వున్నచోట వుండగుండ్లా నాగేస్పరికి. టీవీ ఆన్‌జేసి దాని ముందర కొంచేపు కూలబడింది. ఆ సౌండుకు టీవీని పగలగొట్టేద్దా మనిపిచ్చి ఆపు జేసేసింది. ఇంతట్లో సెల్లు మోగింది. పరమేస్పర మంగళం నుంచేనా ఫోను- అనేసి సెల్లు జూస్తే వాళ్ల యింటాయనే చేసుండాడు. బోజినానికి మద్దేనం రాడంట. లాయరుతో మాట్లాడి సందేళెప్పుడో వస్తాననేసి అన్నాడు. మంచి లాయరుతో మాట్లాడు, పంగమాలిన లాయరుతో మాట్లాడబాక- అని చెప్పేసి ఫోను పెట్టేసింది. మంచి లాయరైతే ఏం జేస్తాడు, చెడ్డ లాయరైతే ఏం జేస్తాడు? లగడాను యింకొంచిం పెద్దది జేస్తారు. తినేస్తారు. కొంపను గుల్ల జేసేస్తారు. ఏది గూడా కోర్టు దాకా పోగూడదు. కోర్టుకు పొయ్యే దోవలోనే తెంచేసుకుంటే మేలుదాయకం. మనిసికి పైనుంచి కిందికీ వొళ్లంతా దిగులు బుట్టిపోతే మాగన్నుగా నిద్ర పట్టేస్తాదేమో! కండ్లు మూతలుబడిపోతుండాయి నాగేస్పరికి. తెల్లారి పదకొండు గెంటల కాడ ఏం నిద్రబోతాం- అనుకోని పెళ్లోకి బొయ్ మొకం కడుక్కో నొచ్చింది.

దేముళ్ల పటాల ముందర నిలబడి ఏందో గొణుక్కునింది. ఏమని గొణుక్కునుంటాది! నా సొత్తు నాకు దక్కేటట్టు చూడండి

తండ్రులాలా- అనే. నేనేం వూలోళ్ల సొత్తులకు ఎగబళ్లా! నా సొత్తే. నా రెక్కల కష్టిమే! నా పిల్లిని నా చంకలో వుండనీండి సాములాలా- అనడగడమే యిది. దీనికి గూడా దేముళ్ల ముందరికి రావాల్సొస్తుండాది. యీ నడమ పెద్ద బక్తురాలై పొయ్యింది నాగేస్పరి. వారంలో మూడు వొక్క పొద్దులు. సోమారం, మంగళోరం, శనోరం - పొద్దనట్టే పొద్దనట్టే పచ్చి మంచినీళ్లు గూడా గొంతులో పోసుకోవాటంలా. మొన్న మొన్నటి దాకా గోడకు యెంగటేస్పరసామి పటం వొక్కటే వుండేది. ఇప్పుడైతే గోడ నిండా దేముళ్ల పటాలే. సుబ్రమణ్యం సావేునా, శిరిడీ సాయిబాబాయేనా, రాఘవేంద్రస్వామేనా - గోడల నిండా దేముళ్ల పటాలే. యాదొచ్చినోడు యెర్రోడు - ఎవురే వైద్దిగం జెప్పినా అన్ని వైద్దిగాలూ చేసుకుంటాడే అట్టా బాపనయ్యోర్లు ఏమి చెప్తే అది చేస్తానే వుండాది. తొమ్మిది యీవతులు తిరప్తికి పొయ్ నవగ్రహాల గుడి గూడా చుట్టేసొచ్చింది వారం వారం. అయినా యీ పొద్దో రేపో పరమేస్పర మంగళం నుంచి అదొచ్చి కొంప మింద పడిపొయ్యేటట్టే వుండాది. ఏ దేముడూ కన్ను తెరవలా. అది ఎవుత్తో గాదు గదా, తోడబుట్టిందే గదా, అంచన బుట్టి పంచన పెరిగిన అక్కే గదా! అంత అక్రానికీ, కిరాతకానికీ పాలుపడదేమో! వూరికే బెదిరిస్తా వుండాదేమో! వొక చూపు చూద్దామనుకుంటుండాదేమో! అది యింటి మిందికొచ్చి రంగం బెడితే యిన్నోళ్లు యిన్నట్టే దాని మొకాన వూంచరా! వూంచతారో, యింగా కొంచం పైకి ఎగదోలతారో! - అనిపించే సరికి యింకా నిరామయమై పొయ్యింది. దాని కూతురు బెంగుళూరులో ఐబీఎంలో వుజ్జోగం జేస్తుండాది. దాని సెల్లుకు ఫోను జేస్తే! బెంగుళూరు పిల్ల మాట్లాడేదాన్ని బట్టి దానమ్మ ఏ దోవలో వుండాదో తెలుసుకోవచ్చును గదా! దైర్నం చాలడంలా నాగేస్పరికి. ఇంత అక్రానికి పాలు పడదు అని అనుకుంటా వుండేంత వొరకే నిమ్మళం. పాలు పడిపోతాది అని తెరపగా అర్తమైపోతే- ఆ అగ్గినెత్తి యీ కడుపులోకి పోసుకోలేదు నాగేస్పరి. అందుకే నంబరు నొక్కి బులుగు బటను నొక్కలేక గమ్మున పెట్టేసింది.

దేముళ్ల పటాల ముందు నుంచి పక్కకొచ్చేస్తా వుంటే కతక్కన యేసు ప్రబువు గమనానికొచ్చినాడు నాగేస్పరికి. ఆయన అందరాల దేముడు గాదంట. సత్య మంతమైన దేముడంట. పెదరోగం వొచ్చినోళ్లనే చేతల్తో ముట్టి బాగుజేసిన దేముడంట. యిట్టా అనుకున్నందుకు మన దేముళ్లకు కోపమొస్తాదేమో అని చెప్పి మళ్లా పటాలకల్లా తిరిగి చెంపలేసుకొనింది. ఇంతమందికి మొక్కుకున్నాము, ఆయన దగ్గిరికి గూడా వొకసారి పొయ్యొస్తే! ఎక్కడెక్కడోళ్లో దుర్గసముద్రం చర్చికొచ్చి వాళ్లవాళ్ల బాదలు తీర్చుకోనిపోతా వుంటారంట. ఇంట్లో ఆయనా లేడు, కొడుకూ కాలోజీకి పొయ్యుండాడు. మద్దేనం సంగటి కూడా చేసుకోవాలనిపించలా. అసలా లెక్కకొస్తే

ఆకిలిగా గూడా లేదు. మద్దేనం అయ్యిందిగాబట్టి ఏమన్నా అంత నోట్లో యేస్కోవాల తప్పించి తినాలనేమీ లేదు. మళ్లా రెండు దోశిలు బోస్కోని మిగిలి పొయ్‌న టమోటా కారం జోలికి పోకుండా ఆ దోశిల్ని మంచినీళ్లల్లో అద్దుకోని తినింది. చిన్నప్పుడు ఇస్కూలుకు పొయ్యేటప్పుడు తినేది యీ మాదిరిగా. వొళ్లు వుడుకై పోయినప్పుడు యిట్టా తింటే చలవ జేస్తిందని అమ్మ చెప్పేది. అవునూ, అమ్మ దగ్గిరికి పొయ్ దాని పెద్దకూతుర్ని నాలుగు జాడించొస్తే! ఏమి పలం! ఆమే యిద్దురు కూతుర్లుంటే యిద్దరిండ్లల్లో వుండకుండా, అందమ్ముడికి పెళ్లాం చస్తే ఆయనకంత కాంచిపోస్తా కాలం గడుపుకుంటా వుండాది. కన్నతల్లి యీ టయింలో వుడికిన పొట్టపేగును గూడా తెంపుకోలేదు. బస్సుబాట దాకా పొయ్ షేరాటో ఎక్కేసి పది రూపాయలు ఆడ పారేస్తే దుర్గసముద్రం దిగిపోవచ్చు. మళ్లా సందేళకంతా ప్రబువుకు ప్రార్దన జేస్కోని యిల్లు జేరిపోవచ్చని దుర్గసముద్రం ఎలబారి పొయ్యింది. చర్చిలో అడుగు పెట్టీపెట్టంగానే, నిజ్జానికి అక్కడ ప్రబువు పోటో గూడా లేదు, ఎంత దుఃక్కం పెరక్కొచ్చిందో అంత దుఃక్కం పెరక్కొచ్చేసింది. ఓ అని ఎక్కిళ్లు పెట్టి ఏడస్తా వుంటే ఫాదరు జూసి, నాగేస్పరి దగ్గిరికొచ్చి, "ఏడువమ్మా ఏడువు. ఏడ్చేవాళ్లతో పాటు ఏడ్చే దేముడాయన. నీ కడుపులో వుండేదంతా యెళ్లబోస్కో. ఆయన్ని నమ్ముకో. బయపడబాక. నీ పాలిట ఆయనుండాడు," అనేసి అన్నాడు. అంత ఏడుపూ ఏడ్చేసినాక నాగేస్పరి మొకం తేటగిల్లింది. వొళ్లంతా తేలిగ్గా అయిపొయ్యింది. ఎక్కిళ్లు అణిగిపొయ్‌నాయి. గొంతులో నుంచి యింగ మాట దాటీగా రావచ్చుననిపించి పాస్టరు అడిగినాడు. "నీ బాదంతా చెప్పు తల్లీ. ఆయన కచ్చితంగా యింటాడు. ఏమీ దాయద్దమ్మా, కొనా మొదుటికి ఏమి జరిగిందో అంతా చెప్పు తల్లీ," అనన్నాడు.

బొటువుగా కూచ్చుని నాగేస్పరి మొత్తం వొక్క గుక్కలో చెప్పేసింది: "మా నాయినకు మేము యిద్దురం కూతుండ్లు సా. మా నాయిన్ని వూళ్లో రాతి మిద్దాయన అనంటారు సా. మా అక్క పేరొచ్చి అశోక. నా పేరు నాగేస్పరి. యిద్దరికీ నడిమద్దిన మూడేండ్లు ఎడం. మాకు అన్నదమ్ముళ్లెవురూ లేరు. మా అక్క ఏడు దాకా, నేను పద్దాకా చదువుకున్నాము. పజ్జెనిమిదేండ్ల ప్రాయంలో మా అక్కను నగిరి దగ్గిర పరమేస్పర మంగళంలో యిచ్చి పెండ్లి జేసినారు. మళ్ల మూడేండ్లకు నన్ను మా వూళ్లోనే యిచ్చినారు. మా నాయినకు రెండెకరాల కయ్యుండాది. వూరంచన గొడ్లు కట్టేసుకునే దానికీ, వాములేసుకునే దానికీ, రాగులూ పాడూ కళ్లం జేసుకునే దానికీ వొక మూడు గుంటల జాగా గూడా వుండాది. మా అక్కా జెల్లి పెండ్లప్పుడే మా నాయిన నోటిమాటగా చెరొక ఎకరా కయ్య యిస్తానని చెప్పినట్టే ఆ కయ్యల్ని మా పరం చేసేసి నాడు. మా అక్కను పరా వూళ్లో యిచ్చినాము గదా. అందుకని ఆ కయ్య గూడా నా

మొగుడే దున్ని పైరు బెట్టి మా అక్కా బావకు గుత్త యిచ్చేసే వాళ్లము. నాకు పెండ్లయిన అయిదేండ్లకు అంటే తొంబైమూడూ తొంబైనాలుగుల్లో మా అక్క మా వూరికొచ్చి, 'యీ వూళ్లో యింక మాకెందుకు కయ్య! ఇక్కడికి మేము రాబోతామా, పట్టబోతామా! మన నాయన సంపాయించిన కయ్య పరావోళ్లకు దేనికమ్మేది? కొను క్కునేటట్టుగా వుంటే నువ్వే కొనుక్కో' అని బేరం బెట్టింది. మీకు తెలవందేముండాది సా, రైతుల చేతుల్లో ఏపొద్దూ దుడ్లు ఇరుపులో వుండవు గదా. నా మొగుడూ నేనూ గూడా కొనుక్కోవాలనే మునాశ పడినాము. మా నాయిన పెట్టిన బంగారే అంతా వూడ్చి జైన్ జువలర్స్‌లో తెగనమ్మేస్తే పదివేలదాకా చేతల్లో పడినాయి. మళ్ల తెగించి యిరై వేలు వొడ్డీలకు దెచ్చి మా అక్కకిచ్చేసి ఆ ఎకరా నాదనిపించుకున్నాను. నేను చేసిన తప్పేమంటే పెద్దతప్పే చేసినాను.'' ఈ కడమాట అంటా వుంటే మళ్లా నాగేస్పరికి దుక్కం పెరుక్కు రాబొయ్యిందిగానీ అణుచుకోని యదాపకారం మొదులు బెట్టింది. ''మా నాయిన గూడా అప్పుడు బతికే వుండాడు. అమ్మగారి సొత్తే గదా పసుపూ గుంకానికి నాకు దానమిచ్చినట్టుగా కోర్టులో స్టాంపు పేపరు మింద దాన విక్రయం రాసుకున్నాము. మా అమ్మా నాయినే రాసిచ్చింది గూడా. వాళ్లిద్దరి యేలిముద్దర్లూ పత్రాలల్లో యిప్పుడు గూడా పడుండాయి. కొనుక్కున్నట్టుగా వొక యెయ్యో రొండు వేలో బెట్టి రిజిస్ట్ర చెయ్యించుకోని అప్పుడే మా అక్క దగ్గిర గూడా సంతకం పెట్టించుకు నుంటే పొయ్యుండేది. ఇప్పుడీ తిప్పల్లా. ఇరైవేలు అప్పు తెచ్చేదానికే గుంటకు గుక్కడు నీళ్లు దాగినామే, మళ్ల రిజిస్ట్ర కర్జులు అనావశంగా ఎవురు దిన్న పొడన్జెప్పేసి ఆ పని చేసినాము. యిప్పుడు బూముల వాల్యుయేసం పెరిగి యాడికో పొయ్యేసరికి మా అక్క అడ్డం తిరుక్కుంటా వుండాది. నాతో అయితే యీ రోజుటికీ అనలా. వూళ్లోనూ ఎవుర్తో అన్లా. అనాలంటే మొకం వుండొద్దా! అయితే మొన్నా నడమ మా బందుగుల్ది నలుగొగటుంటే వూళ్లోకొచ్చుండి మా యమ్మతో అనిందంట, 'అప్పుడెప్పుడో తెలవని తనంతో ముప్పైయ్యేలకు కూట్నీళ్లకు దారబోసినట్టు దారబోసేసి పొయ్‌నాము. అవన్నీ దొబ్బవు. ముప్పెయ్యేలకు యీ యిరై ఏండ్లూ కావాలంటే అసలూ వొడ్డీయేసి యిచ్చేస్తా. ఆ ఎకరా నాదిగాక యింకెవుర్ది? పసుపు గుంకాలకు మీరు దానికే దాన మిచ్చేస్తే చెల్లుబాటవతాదా? నాకు పన్లేదా పసుపూగుంకాలు? నేనేమన్నా తెంపేసి వుండానా! మరేదగా నీ చిన్నకూతురికి చెప్పిపెట్టు. లేదంటే కోర్టు నుంచి కాతికం పంపిస్తాను. నా కయ్యలో మడకెట్ట కడతారో చూస్తాన'నేసి బెదిలిచ్చేసి పొయ్యుండాది. దాని అక్రం యింకా చూడండి సా. మళ్లొక సమ్మచ్చరానికంతా, 'నాకు చేబదులుగా యెయ్యి రూపాయలుంటే యియ్యమ్మే, నీ చేతన లేకుంటే ఏడన్నా యిప్పిచ్చు' అంటా నగిరి నుంచొచ్చి నా నట్టింట్లో కుచ్చునేసింది. 'ఏమి అక్కరో ఏమి నాశినమో'

అని చెప్పి నా దగ్గిర్నే మాసూలు దుడ్లు వెయ్యి రూపాయలుంటే లప్పగా మా అక్క చేతల్లో బెట్టినా. అదేరోజు మాయక్కతో, 'చీకి చెట్లు మొలిచిపొయ్యుండే మన దిబ్బల జాగా నీకేమిటికక్కా. అదేమన్నా పైరు బెట్టుకునే చోటా? నాయంగా నీకు రావాల్సిన బాగం ఆ వొగిటిన్నర గుంటా నేనే ఎత్తుకుంటా. ఈ యెయ్యి నువ్వింగ నాకియ్యాల్సిన పన్లా. నేనే కొనుక్కుంటా వుండాననుకో.' అనేసి అన్నాను గూడా. అప్పుడా మనిసి, 'బంగారుగా ఎత్తుకో, నేనేమన్నా నగిరి నుంచొచ్చి యీడ దిబ్బెయ్యబోతానా' అనేసి ఆ యెయ్ రూపాయలూ పెరుక్కోని పొయ్యింది. మొన్న ఆ జాగా కత గూడా మా యమ్మ తావన ఎత్తిందంట- 'నీ చిన్నకూతురు దానిష్టపకారం అది ఎమ్మార్వో ఆఫీసుకు పొయ్ యిన్నూరోమున్నూరో లంచమిచ్చి దిబ్బల జాగాను పాసుబుక్కులోకి ఎక్కించు కుంటే సరిపోతిందా? చెల్లుబాటు కావొద్దా!' అనేసి. ఈ పొద్దు లాయరును కలిసి మంచీచెడ్డా మాట్లాడేదానికి మా యింటాయన గూడా తిరప్తికే పొయ్యుండాడు. లోకంలో మంచి యాడుండాదో మీరు చెప్పండి సా. ఆ కాలంలో ఆ యిరైయ్యేలూ అప్పుదీర్చేదానికి కన్నోడి అగచాట్లన్నీ పడినాడు మా యింటాయన. రేత్రిపూట చేనుకు నీళ్లు గట్టి నాలుగేండ్లు నన్నూర్రూపాయిలకు తిరప్తికొచ్చి ప్లయ్‌వుడ్ షాపులో గూడా జాబ్ జేసినాడు సా. నేను రెండు జర్సీ ఆవులతో యేగి - పదేండ్లు బట్టింది ఆ అప్పు తీరేసరికి. యింతా జేస్తే మాయక్క యీరోజు కక్కేసిన కూటికి ఆశి పడతుండాదిగానీ అంత అవసరం లేదు సా. కూతురికి మంచి జాబ్బు. కారు గూడా కొనింది. వాళ్ల వూళ్లో రెండెకరాల దాకా కయ్య గూడా వుండాది. నగిరి పక్క గూడ మిడిమేలమైన రేట్లు సా. మద్రాసోళ్లొచ్చి ఆ పక్కన పడిపొయ్ వో అని పెంచేసినారు. నాకంటే మా యక్కకే ఎక్కువ వుండాది. పైగా నాకు మొగబిడ్డి. మా అక్కకు వొక్కటే ఆడబిడ్డి.''

ఎంతో నిమ్మళంగా దీన్నంతా చెవల్లో యేసుకున్న పాస్టరు, ''అమ్మా యీ బూములూ బావులూ, మిద్దెలూ మేడలూ, నగలూ నాణ్ణేలూ ఏవి గూడా నీకు అక్కర లేదు తల్లీ. ఇట్టాంటివి అన్ని వూళ్లల్లో వుండేదే. యీ ఎవ్వారాలేవీ ఆయనకు పట్టవు. ఆయన దయ, ఆయన కృప నీకెప్పుడూ వుంటాయి తల్లీ. మనసును పొల్లించుకోవద్దు యిట్టాంటి ఎవ్వారాల్తో! ఆయన్ని చూడు. ఆయన కల్లానే చూడు. యింక దేని కల్లా చూడొద్దు. బయపడద్దమ్మా.'' అని చెప్పి, మంచిగా ప్రార్దన జేసి పంపించేస్తే, నాగేస్పరి తిరిగి షేరాటో ఎక్కి యింటికొచ్చేకొందికి యెచ్చూ తక్కువ నాలుగైపొయ్యింది. నిజానికి చర్చి నుంచి బైటికి రాంగానే నాగేస్పరికి పాస్టరు మింద కోపమొచ్చింది. అంత చెప్తే అదంతా వినిన పెద్దమనిసి, ''మీ అక్క ఏందమ్మా కిరాతకురాలుగా వుండాదే! ఆమెకు దేముడే యేస్తాడమ్మా శిచ్చ!'' అని వొక్కమాట అనలేకపొయ్‌నాడే అనిపిచ్చిందిగానీ యిప్పుడు మంచిమాటలే చెప్పినాడనిపిస్తా వుండాది. ఒకేళ,

మాటొరసకి, మన నాయినకు పదెకరాలుండిందనుకో. లచ్చా యాబైవేలు అప్పుజేసి అక్క దగ్గిర దాని బాగం అయిదెకరాలే కొనుక్కోనుంటే! ఒక ఎకరా నాశినానికే యింత దుఃక్కంగా వుండాదే! అదే అయిదెకరాలైతే? ఆ దుఃక్కం బరిచ్చగలిగేదా! నిజమే, ఆయన దయ వుండాల్నేగాని యీ దుఃక్కాన్ని తెచ్చి పెట్టే ఆస్తి దేనికనిపిచ్చింది. ప్రబువును తల్చుకోని, "ప్రబువా! తండ్రీ! మా అక్కకు మంచి బుద్దినియ్యి నాయినా! కక్కిన కూటికి ఆశిపడొద్దని చెప్పు తండ్రీ. నాకు న్యాయం జరిపించు నా తండ్రీ" అని దండం బెట్టుకొనింది. కొంచేపు ఆస్తితో సమందం లేకుండా ఆయన్ను తలుచు కోవాలనిపిస్తే అది వీలుగాలా. మొగుడు బండిలో తిరప్తి నుంచొచ్చి బండికి స్టాండేసేసి యింట్లేకి రాంగానే మళ్ల నిమిసం వుండలేక పొయ్యింది నాగేస్పరి ప్రబువులో. "ఏం బా, లాయరేమన్నాడా!" అని ఆత్రపడింది. దీనికాయన, "రిజిస్ట్రు చెయ్యించుకోని యిలావరిగా రాసుకోంది మందే బుద్తక్కవంటాడు. దాన్ని నోటీసే పంపించనీ, మచ్చు కత్తితో నరికేసి పోలీసుస్టేషనుకు దాని తలకాయెత్తుకోని ఎస్సయ్ టేబులు మింద పెట్టకపోతే అప్పుడడుగు" అని యీడెగిరి ఆడ దూకినాడు. ఈ మాటలకు కడుపు గాలిన నాగేస్పరి, "అయా, తమరు కొంచిం తగ్గాల. మద్దేనం బాగ వుప్పుతో తిన్నట్టుం డావు. అది రేపో ఎల్లుండో వొచ్చేది కాయం. నువ్విట్టా పోరంబోకు మాటలు గాని జారిడిసినావంటే అసల్ది యెనక్కి బొయ్ యీ మాటలు ముందుకొస్తాయి. బాద మన్ది. అది కొండకొక యెంటికేస్తా వుండాది. దాన్దేముండాది వొట్టి యెంటిక. మన్ది ఎకరా కయ్య. తెలివిగా బోవాల. ప్రబువు మనల్ను చెడపడు. యిందాకా దుర్గసముద్రం చర్చికి గూడ పొయ్యొచ్చినా. ఎన్ని మంచి మాటలు చెప్పినాడో తెలుసునా పాస్టరు! పది పదున్ల వాన పడినా పదరగూడదు. నువ్వా కోపం కొంచిం కట్టిపెట్టు." అనంటా యిగలేనట్టు చెప్పింది.

కాలేజీకి పొయ్న కొడుకు కపిలేస్పరుడు గూడా బండిలో తిరప్తి నుంచొచ్చేసి నాడు. కొడుకున్జూసే కొందికి అయ్యోమనిపించింది. ఎకరా కయ్య! యీ పొద్దు దొంగ చేతిలో బెట్టినా నలపై లచ్చలు. బిడ్డకు లేకుండా పోతే వాడెట్ట బతకబోతాడని పించింది. అంతట్లోకే ఆమె అంతట ఆమెకే చిటామనిపించింది. అసలు వాడికి కయ్యే మిటికి! వోడు సేద్యమెందుకు చేస్తాడు! ఎంత తెలివిమంతుడు నా కొడుకు! వూళ్లో యిస్కూల్లోనే తెలుగు మీడియంలోనే చదువుకున్నాడు. ఇంటరు నారాయణా కాలేజీలో యింగ్లీషు మీడియంలో ఎంపీసీ తీస్కోని చేర్నాడు. పిలగోడు ఎంసెట్ రాస్తే అయిదు నూర్లొచ్చింది రాంకు. పాస్టరు చెప్పినట్టు ఆయన దయ నా మింద లేకపోతే అంత మంచి రాంకు వచ్చేదా! ఎస్వీయూనోర్శిటీ కాలోజిలో యింజనీరు కోర్సులో అదీ ఇసిఇలో సీటు సంపాదించుకున్నాడంటే సామాన్నిమా! యిప్పుడు

మూడో సమ్మచ్చరం చదవతా వుండాడు. కోర్సు యింగా సమ్మచ్చరం వుండంగానే అయిదు లచ్చల రూపాయలకు ఇన్ఫోసిస్‌లో క్యాంపస్ సెలక్సన్‌లో వుజ్జోగం సంపాదించుకున్న మొగలాయి. అటుమంటోడి మింద అయ్యోమంటుండాన్నేను! నాకు మరుజన్మ వస్తిందా! ఇదే పిలగాడు ఇంటర్ పయిలైపొయ్ చదువుకు కొరగాకుండా పొయ్యుంటే నా గతి ఏమయ్యుండాల! ఈ బోగమిచ్చినందుకు దేముడికి నేను దండం పెట్టుకుంటా వుండానా! లేనే లేదు. నా అక్క నా కయ్య జోలికి రాకుండా వుండాలని దండం బెట్టుకుంటుండాను. నా కొడుక్కి అంత మంచి రాంకు యిచ్చినావు తండ్రీ, మంచి కాలేజీలో సీటు యిచ్చినావు నాయినా, కాంపస్‌లో సెలక్టు అయ్యేటట్టు చూసినావు దేముడా. నీ దయ నాకింక చాలు నాయినా- అని ఏ పొద్దన్నా కుశాలగా దేముళ్ల ముందర నిలబడినానా! రేపు జరగబొయ్యే చెడ్డకు దీటుగా మనసు నిమ్మళంగా వుండేదానికి ఎన్నెన్ని రకాలుగానో యోచన జేస్తా వుండాది నాగేస్పరి. మానుడి జల్మ మిందనే రోతబుట్టిపోతుండాదామెకి. యెల్లాలకల పొనుకోని మొకాన ఎంగిలి పడేటట్టుగా వూంచుకుందామనిపిస్తా వుండాది. ఒకపక్క ఓ అని కుశాల, యింగొకపక్క ఎక్కళ్లేని దుఃక్కం ఆమెని వూపిరాడనీకుండా చేస్తుండాయి. అన్నాలు తినేసి అందురూ పొనుకున్నా, నిద్దర రావడంలేదు.

గబక్కన గొంతులో నుంచి మాటొచ్చేసింది. 'నాయినా కపిలేస్పరా. బెంగుళూరక్క అపర్ణకు ఫోను చేసి, నా చేతికిస్తావా!'- అదీ ఆ మాట. అనాలని అనుకోను గూడా లేదు. అనేసింది. ఫోను చేసి చేతికిచ్చినాడు. ఫోను మోగినెమ్మటే కూడా తీసినట్టు లేదు అపర్ణ. రెండు నిమిసాలకంతా మాట్లాడేసి కొడుకు చేతికి ఫోనిచ్చేసింది. ఫుల్లుగా అర్తమైపొయ్యింది నాగేస్పరికి. 'బాగుండావా అపర్ణా' అంటే, ''ఏదో అట్లా వుండాం' అంట. 'పిన్నీ' అనే మాటే లేదు. 'చెప్పండి' అంట. 'అవ్వ నిన్ను చూడాలనుంటుండాది. ఎప్పుడొస్తావు?' అనంటే 'అవ్వెవురూ?' అని దీర్గం. తమ్ముడితో మాట్లాడతానని గూడా అనలేదు. పిన్నీ అనే మాట లేకపొయ్‌నా అప్పుటికీ సిగ్గొదిలి, 'నువ్వీ మద్యన టీమ్ లీడరు అయినావంట గదా. జీతం బాగ పెరిగిందంట గదా అమ్మ చెప్తే నాకు బలే సంతోసమేసింది.' అనంటే, 'మీవూళ్లో బూములు పెరిగినట్టు పెరగలేదిక్కడ మా జీతాలు.' అని టకిక్కన ఫోను పెట్టేసింది. ఇంక చాల్దా! అమ్మా కూతురు ఏం మాట్లాడుకోనుండారో అర్తమైపోలా. నాలుగు దినాలకు ముందర వీళ్లమ్మ గూడా యింతే. నిమ్మళం చిక్కక నాగేస్పరి ఫోను చేసి, అక్కను ఎప్పుడూ అకా అనింది లేదు గాబట్టి, 'ఏమ్మే ఎట్టుండావు?' అని తొలిమాటగా అంటే, దానికి బదులేందో తెలుసునా- 'సగం పుచ్చిపొయ్యుండా' అనేసి. అప్పుటికీ మానాన్ని మాకుకు కట్టేసి, 'వంటేం వొండినావమ్మే' అనడిగితే, 'మాదేమన్నా తిరప్తి పక్క మిట్టూరా అమ్మా వంటలొండుకోని

ఆరగించేదానికి? నగిరి పక్క పరమేస్పర మంగళం. సంగటో సలిబిండో చేసుకోని తిని మీ వొప్పందం మేమూ వూపిరి కాపాడుకోవాల గదా.' ఇంకేం మాట్లాడతాం! అప్పట్నుంచే యీ బిత్తర. ఎప్పుడు నిద్దరబట్టిందో తెలవదు నాగేస్పరికి.

తెల్లారి నిద్దర పడక లేచేసరికి యింటి ముందర పరమేస్పర మంగళం నుంచొచ్చిన వేగనార్ కారు. యింట్లో అశోక. చింతకాయలు రాలినట్టు వొకే మాటలు. రాత్రి పెళ్లాం ఏం మాట్లాడిందో ఏమోగానీ నాగేస్పరోళ్ల యింటాయన, నిన్ననంగా నరికేస్తాను పడతాను- అంటా వున్న మనిసి గమ్మున మడికాడికి పూడ్సినాడు, అంత్రం కట్టించుకున్నోడి మాదిర్తో. కపిలేస్పరుడూ చడి చెయ్యలేదు. అశోక మాత్రం మాట్లాడింది మాట్లాడినట్టే వుండాది. రాతి మిద్దాయనకు ఆమె కూడా పుట్టిందంట. యింకెవురికో గాదంట. ఎకరా కయ్యను దొబ్బేసి ఆమె మొకాన కొట్టిన ముప్పై వేలకు యీ యిరై యేండ్లూ వొడ్డీ లెక్కేస్తే రెండు లచ్చిలు అయ్యుంటాదంట మఖా అయితే. ఆ రెండు లచ్చిలూ యిసిరి ఆడ పారేస్తిందంట. వెయ్యి రూపాయలకు చెల్లు బెట్టేసిన దిబ్బల జాగాలో ఆమెకు వొగిటిన్నర గుంట- అంకణాల్లో లెక్కేస్తే, నూరంకణాల దాకా రావాలంట. యీ పొద్దు అంకణం ఇరై యేలంట. దాని వాల్యుయేసమే ఇరై లచ్చిలంట. అట్టాంటిది యెయ్యి రూపాయలకు ఎందుకొదులుకోవాల- అనేదొక కొసినీ. ఆ యెయ్యికి తొమ్మిదివేలు ఎగేసి ఎడంచేత్తో ఆడ పారేస్తిందంట. దిబ్బల జాగాలో సగమూ, ఆ ఎకరా కయ్యా మంచిమాటల్తో రాసిస్తే సరి, లేకపోతే అగో కోర్టు నోటీసు- అని కొంచేపు మాట్లాడేది నిలిపి, కోర్టు నోటీసూ దానిమింద రెండులచ్చిలా పదివేల్రూపాయల డబ్బూ పెట్టి గస పోసుకొనింది. ఈ మాటలేవీ చెవల్లో యేస్కోలేదుగానీ ఆ డబ్బునైతే చూసింది నాగేస్పరి. అప్పటికే స్నానం చేసేసుండాది. కొడుక్కంత టిఫను బెట్టి ఆమె అంత తినింది. అశోక అక్కడ పెట్టిన డబ్బులో నుంచి నాగేస్పరి ముప్పై వొక్క వేలు మాత్రం తీస్కోని మిగతా డబ్బును అక్కడనే పెట్టేసింది. నిమిసంలో అక్క చేతికి పాసుబుక్కులు రెండూ ఆధార్‌కార్డులు యిచ్చి, ''నువ్వు చెప్పినట్టే. రిజిస్ట్రాపీసుకు పొయ్ నువ్వు కోరినట్టే పత్రాలు రాయించు. పదకొండు గెంటలకంతా నేను నా కొడుకుతో వొచ్చి సంతకం జేస్తా,'' అనింది ఎంతో నిమ్మళంగా. మళ్ల ఒక్క మాట మాట్లాళ్లా. అశోక ఆ డబ్బునెత్తుకోని, పాసుబుక్కులు తీస్కోని వేగనార్‌లో అసోబుసోమంటా తిరప్తికి ఎలబారిపొయ్యింది. నాగేస్పరి చెప్పినట్టే పదకొండుకంతా తిరప్తి రిజిస్ట్రాపీసుకు పొయ్ సంతకాలు పెట్టేసింది. ఆపీసులో అంత పనీ అయిపొయ్యింది. వేగనార్ కారు పరమేస్పర మంగళంకల్లా పరుగుతీసింది. దాన్ని ఎక్కతా ఎక్కతా ఏమీ అర్తంగాలా అశోకకి. చెల్లి ఎంత రచ్చజేస్తాదో అనుకొంటే, వొక్క మాటగూడా మాట్లాడకుండా వొట్టి ముప్పైవొక్క వేలే దేనికని తీసుకొనిందో ఎంతకీ అర్తంగాలా. యిప్పటి

కిప్పుడు గుడ్డలిప్పేసి యీదలబడి పరిగెత్తేద్దామన్నంతగా పిచ్చిపట్టిపొయ్యేటట్టుండాది అశోక్కి. ఒకేళ కారు నగిరికి పొయ్యేసరికంతా డోరు తెరిచి దూకేసి, నగిరి నాలు గీదులూ మొండిగా తిరగతా గూడా వుండిపోవచ్చు. నాగేస్పరి మాత్రం  కళయిన మొకంతో, ఆ ముప్పై వొక్క వేలతో, కొడుకుతో అదే బండిమింద కొండకు ఎలబారి పొయ్, దేముణ్ణి దర్శినం జేస్కోని వొక పదైదు వేలు కొడుకు చేతికిచ్చి వుండీలో యెయ్యించింది. మిట్టూరుకు వొస్తా వొస్తా నడిమద్దెలో దుర్గసముద్రం దగ్గిర బండి నిలిపించి, చర్చిలోకి పొయ్, ఫాదరు చేతికొక పదారువేలిచ్చి, "ప్రార్దనలకొచ్చే బీదా సాదకు ఆదోరం ఆదోరం అన్నం పెట్టించు దేవరా!" అని చెప్పి సందలగూకన యిల్లు జేరిపొయ్యింది నాగేస్పరి.

యిప్పుడు నెత్తి బొరువు నేల దిగిపొయ్‌నట్టుండాది నాగేస్పరికి.

రేత్రికి వొళ్లు దెలవకుండా నిద్దరపోబోతాది రాతి మిద్దాయన చిన్న కుమార్తె.

*ఈనాడు ఆదివారం*
*2 ఆగస్ట్ 2016*

✻



10 మార్చి 1960న చిత్తూరు జిల్లా మిట్టూరులో జన్మించిన నామిని సుబ్రమణ్యం నాయుడు పచ్చనాకు సాక్షిగా కథలతో ప్రసిద్ధులు. సినబ్బ కతలు, మిట్టూరోడి కతలు కథాసంపుటాలు; మునికన్నడి సేద్యం, పాలపాదుగు, మూలింటామె నవలలు ప్రచురించారు. పిల్లల కోసం కథలు, విద్యాభ్యాసానికి సంబంధించిన కొన్ని పుస్తకాలు ప్రచురించారు. కొంతకాలం జర్నలిస్టుగా పనిచేశారు.

***చిరునామా: 211, అన్నమయ్య టవర్, యాదవ కాలనీ,***
***తిరుపతి - 517 501***
***ఫోన్: 0877-2242102, 97034 36763***